జర్నలిస్ట్ వార్త



# ధర్మసాగర్ మండలంలో ఘనంగా మేడే ఉత్సవాలు

## ఎర్రజెండాలతో మార్మోగిన గ్రామాలు- కార్మికుల ఐక్యతే బలం అంటూ నినాదాలు






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 1 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. శ్రమజీవుల పోరాట చరిత్రను స్మరించుకుంటూ, కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలనే సందేశంతో ఎర్రజెండాలను ఎగురవేసి నినాదాలతో గ్రామాలు మార్మోగించాయి. సిపిఐ ఆధ్వర్యంలో తాటికాయల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పెసర యాదగిరి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యతే ప్రధాన ఆయుధమని అన్నారు. సాయిపేట గ్రామంలో కనుకొంటి రాజయ్య జెండా ఎగురవేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురం గ్రామంలో పెద్ద




పెండ్యాల నారాయణ గిరి, వల్లపు ధర్మారెడ్డి సంయుక్తంగా జెండాను ఆవిష్కరించి శ్రమజీవుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకుడు దొకి రాజయ్య జెండా ఎగురవేసి కార్మికుల హక్కుల పరిరక్షణపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు శ్రమజీవుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ల రూపంలో తీసుకొస్తున్న చట్టాలు కార్మికుల హక్కులను కుదించేలా ఉన్నాయని విమర్శించారు.

వక్తలు ఇంకా మాట్లాడుతూ, మేడే కేవలం ఉత్సవం మాత్రమే కాకుండా కార్మిక వర్గ పోరాటానికి ప్రతీక అని, ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవుల ఐక్యతకు ఇది చిహ్నమని పేర్కొన్నారు. కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు, కనీస వేతనాల పెంపు, భద్రతా హామీలు, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో చిలుక బాబు, సాయిపేట కొమురయ్య, రాధారపు సదయ్య, చంద్రయ్య, లచ్చయ్య, పరమేష్, సుధాకర్, కమలమ్మ, సుగుణ, వెంకటాద్రి, రాములు, లక్ష్మీనారాయణ, వెంకటమల్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలు మొత్తం కార్మిక ఐక్యత నినాదాలతో ఉత్సాహభరితంగా సాగాయి.